




అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..






సంపుటి - 2 సంచిక -136 శనివారం 9 ఆగస్టు 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




## అటు చైనా ఇటు రష్యాతో

# బంధం బలంగా

## ట్రంప్ సుంకాల వేళ పుతిన్‌తో ప్రధాని మోడీ ఫోన్ సంభాషణ

- ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితిపై చర్చించట్లు ప్రకటన
- ఎస్సీఓ సదస్సుకు రండి... మోదీకి ఆహ్వానం పలికిన చైనా
- ఈ నెలాఖరులో చైనాలో జరగనున్న ఎస్సీఓ శిఖరాగ్ర సమావేశం
- సదస్సుకు హాజరుకానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- మోదీ పర్యటనను అధికారికంగా స్వాగతించిన చైనా ప్రభుత్వం
- 2020 గల్వాన్ ఘర్షణల తర్వాత మోదీకి ఇదే తొలి చైనా పర్యటన
- సరిహద్దు వివాదంపై ఒప్పందం తర్వాత మెరుగవుతున్న సంబంధాలు



**న్యూఢిల్లీఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** ట్రంప్ సుంకాల బెదరింపుల వేళ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కు ప్రధాని మోదీ ఫోన్ చేశారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌కు సంబంధించి తాజా పరిస్థితులను ప్రధాని మోదీకి పుతిన్ వివరించినట్లు- తెలిసింది. ఈ సంక్షోభం ముగింపునకు శాంతియుత చర్చలే పరిష్కార మార్గమని భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసినట్లు- ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది.భారత్-రష్యాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపైనా ఇరువురు నేతలు చర్చించారు. ఇరుదేశాల మధ్య ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతంమిగతాది 2లో...

# బిజెపికి తొత్తుగా ఎన్నికల సంఘం



## ఓట్ల దొంగతనానికి ఇసి సహకారం

### -తన ఆరోపణలపై ఇసి ఎందుకు మౌనం


### వెంటనే ప్రజలకు నిజాలు వెల్లడించాలి

### -బెంగళూరు సమావేశంలో రాహుల్ తీవ్ర విమర్శలు

**బెంగళూరు,ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** ఎన్నికల సంఘం తన బాధ్యతల్ని విస్మరిస్తోందని, రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన సంస్థ ఇప్పుడు బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఓట్లను దొంగిలించేందుకు ఎన్నికల సంఘం సహకరిస్తోందని ఆయన విమర్శించారు.మిగతాది 2లో...

# ఆవరిస్తున్న క్యుములో నింబస్

## భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక



**హైదరాబాద్,ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. అయితే దక్షిణ తెలంగాణకు భారీ వర్ష సూచన ఉన్నట్టు-వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనంతో మరో నాలుగు రోజులు వానలు దంచికొట్టనున్నాయని పేర్కొంది. నల్లగొండ, యాదాద్రి, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు రావాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.మిగతాది 2లో...

# బిజెపితో బిఆర్ఎస్ పొత్తు సాధ్యమేనా?

## బిసి బిల్లుపై ఇరుపార్టీలకు కాంగ్రెస్ సవాల్

## తాజా రాజకీయాలపై సర్వత్రా ఆసక్తి




**హైదరాబాద్,ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** పదేళ్లపాటు అధికారం అనుభవించి, ఆర్థికంగా బలపడి, ఇష్టారాజ్యంగా పాలన చేసిన బిఆర్ఎస్‌కు ప్రస్తుత పరిస్థితులు మింగుడు పడడం లేదు. వరుసగా మూడోసారి అధికారం తమదే అనుకున్న తరుణంలో పరిస్థితులు తలకిందులు అయ్యాయి. ఈ ఉక్కపోతను కెసిఆర్ కుటుంబం భరించకోలేక పోతున్నది. అందుకే తరవాత తమదే అధికారం అని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. రేవంత్ సర్కార్‌ను విధానాల పరంగా కాకుండా వ్యక్తిగతంగా విమరశలకు దిగుతున్నారు. ఓ వైపు విచారణ, మరోవైపు విమర్శలు, ఇంకోవైపు కూతురు కవిత సొంత రాజకీయాలు మిగతాది 2లో...

# ఆధారాలు చూపించు, లేదంటే క్షమాపణ చెప్పు

## : బండి సంజయ్ పై కేటీఆర్ ఫైర్



- 48 గంటల్లోగా క్షమాపణ చెప్పాలని గట్టిగా డిమాండ్
- లేకపోతే పరువునష్టం దావా వేస్తానని తీవ్ర హెచ్చరిక
- త్వరలోనే లీగల్ నోటీసులు పంపుతామని వెల్లడి
- బండికి కనీస పరిజ్ఞానం కూడా లేదంటూ ఘాటు విమర్శలు
- కెటిఆర్‌కు రాఖీ కట్టిన లగచర్ల గిరిజనమహిళలు

**హైదరాబాద్,ఆగస్ట8(ఆర్ఎన్ఎ):** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తనపై చేసిన ఆరోపణలను 48 గంటల్లోగా వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బండి సంజయ్‌పై పరువునష్టం దావా వేసి కోర్టుకు ఈడుస్తానని కేటీఆర్ గట్టిగా హెచ్చరించారు. ఈ మేరకు త్వరలోనే ఆయనకు అధికారికంగా లీగల్ నోటీసులు పంపనున్నట్లు స్పష్టం చేశారు.మిగతాది 2లో...

# భారీవర్షాలతో ఇక్కట్లు

## అప్రమత్తంగా ఉండాలి సిఎం ఆదేశం

### పొంగిప్రవహిస్తున్న మూసీ నది

### ఈదులవాగులో కొట్టుకు పోతున్న కారును కాపాడిన స్థానికులు





2లో.

# ఫోన్ ట్యాపింగ్‌లో వేలకోట్ల వల

## వ్యాపార, సినీ, రాజకీయ ప్రముఖుల బ్లాక్‌మెయిల్

- ఎన్నికల్లో పట్టుబడ్డ వందలకోట్లు కెసిఆర్ ఖాతాలోకి
- భార్యాభర్తల ఫోన్లుకూడా ట్యాప్ చేసిన దుర్మార్గులు
- అత్యధికంగా నా ఫోన్ ట్యాప్ జరిగింది
- ప్రభాకర్ రావు, రాధాకిషన్ రావులకు ఉరిశిక్ష వేసినా తక్కువే
- సిట్ విచారణతో ఒరిగేదేమీ లేదు
- సిబిఐ విచాణతోనే దొంగలను పట్టుకునే ఛాన్స్
- సిట్ విచారణ అనంతరం మీడియాతో బండి సంజయ్



**హైదరాబాద్,ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోమారు డిమాండ్ చేశారు. ఇందులో లోతుగా విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చాల్సి ఉందన్నారు. హైదరాబాద్‌లోని దిల్‌కుషా అతిథి గృహంలో సిట్ విచారణకు హాజరైన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని ఆరోపించారు. అందుకే కేసీఆర్ కుటుంబానికి సీఎం క్లీన్ చిట్ ఇచ్చారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సిట్‌కు అధికారాలు లేవని, విచారణతో కాలయాపన తప్ప ఇంకేం జరగదని అన్నారు. గతంలో భారత రాష్ట్ర సమితి దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోందని దుయ్యబట్టారు. సిబిఐ విచారణకు ఎందుకు వెనకాడుతున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వంలో అత్యధికంగా నా ఫోన్ కాల్స్‌నే ట్యాప్ చేశారు.మిగతాది 2లో...

# 10న బిజెపిలో చేరుతున్నా: గువ్వల



2లో.

# బంధం బలంగా

(మొదటి పేజీ తరువాయి)

చేయడంపై ఇరువురు నేతలు తమ నిబద్ధతను చాటుకున్నట్లు- తెలిసింది. ఈ సందర్భంగా 23వ భారత్-రష్యా వార్షిక సదస్సులో భాగంగా ఈ ఏడాది చివరలో భారత్‌లో పర్యటించాలని పుతిన్‌కు ప్రధాని మోదీ ఆహ్వానించినట్లు- పీఎంవో వెల్లడించింది. అయితే, రష్యా నుంచి చమురు కొనుగోలు నేపథ్యంలో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు విధించిన వేళ ప్రధాని మోదీ పుతిన్‌తో సంభాషించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇకపోతే ఇదే అంశంపై చర్చించేందుకు పుతిన్‌తో భారత భద్రతా సలహాదారు అజిత్ దోబల్ ఇప్పటికే మాస్కోలో ఉన్నారు. ఆయన పుతిన్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాలకు సంబంధించిన తాజా పరిస్థితులను వారు చర్చించారు.

భారత్, చైనా మధ్య సంబంధాల విషయంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. 2020లో గల్వాన్ లోయలో జరిగిన హింసాత్మక ఘర్షణల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారిగా చైనాలో పర్యటించనున్నారు. ఈ నెలాఖరులో టియాంజిన్ నగరంలో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు వస్తున్న ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్నట్లు చైనా శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఈ ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో టియాంజిన్‌లో ఎస్సీఓ సదస్సు జరగనుంది. ఈ సమావేశానికి భారత ప్రధాని మోదీ వస్తున్న విషయాన్ని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గువో జియాకున్ బీజింగ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ధృవీకరించారు. "ఎస్సీఓ టియాంజిన్ సదస్సు కోసం ప్రధాని మోదీ చైనాకు రావడాన్ని మేము స్వాగతిస్తున్నాం. అన్ని సభ్య దేశాల సమష్టి కృషితో ఈ సదస్సు విజయవంతమవుతుందని, ఎస్సీఓ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని విశ్వసిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు.

గల్వాన్ ఘర్షణల అనంతరం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దాదాపు నాలుగేళ్ల పాటు సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగాయి. అయితే, ఇటీవలే వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంబడి గస్తీ విషయంలో ఇరు దేశాల మధ్య ఒక అంగీకారం కుదరడంతో ప్రతిష్టంభన వీడింది. ఈ సానుకూల వాతావరణంలోనే ప్రధాని మోదీ పర్యటన ఖరారైంది. 2019 తర్వాత మోదీ చైనాలో పర్యటించడం ఇదే ప్రథమం.

ఈ పర్యటనకు ముందు, ఇరు దేశాల మధ్య సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చేందుకు ఉన్నత స్థాయి సమావేశాలు జరిగాయి. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఇటీవలే చైనాలో పర్యటించారు. ముఖ్యంగా, ఉగ్రవాదంపై ద్వంద్వ వైఖరిని విడనాడాలని, లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అజిత్ దోవల్ ఎస్సీఓ భద్రతా సలహాదారుల సమావేశంలో గట్టిగా నొక్కి చెప్పారు.

భారత్, చైనా, రష్యా, పాకిస్థాన్ సహా మొత్తం పది దేశాలు సభ్యులుగా ఉన్న ఎస్సీఓను 2001లో స్థాపించారు. ఈసారి టియాంజిన్‌లో జరిగే సదస్సు, సంస్థ చరిత్రలోనే అతిపెద్దదిగా నిలవనుందని చైనా వెల్లడించింది. సుమారు 20 దేశాల నేతలు, 10 అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమాలలో పాల్గొననున్నారు.

# భారీవర్షాలతో ఇక్కట్లు

**హైదరాబాద్,ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్ నగరంలో వర్షాలతో తలెత్తుతున్న ఇబ్బందులు, వరద సమస్యకు శాశ్వత పరిష్కారంపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. భారీ వర్షాలనేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడా ప్రాణ నష్టం లేకుండా చూడాలన్నారు. సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి,సెక్రటరీ ఇలంబర్తి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, ఈవీ నర్సింహా రెడ్డి, జేఎండీ పి.గౌతమి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. వలిగొండ మండలం సంగెం సమీపంలోని భీమలింగం వద్ద లోలెవల్ బ్రిడ్జి పై నుంచి మూసీ ప్రవాహం కొనసాగుతోంది. వరద ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ఉండటంతో వంతనపై ఎవరూ ప్రయాణించకుండా పోలీసులు బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు- చేశారు. దీంతో సంగెం పరిసర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భువనగిరి నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. బీబీనగర్ మండలం రుద్రవెల్లి వద్ద బ్రిడ్జి కింద నుంచి మూసీ ప్రవహిస్తోంది. రంగారెడ్డి, హైదరాబాద్. యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురవడంతో మూసీ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. చౌటుప్పల్ మండలంలో ఈదుల వాగు పొంగి ప్రవహించడంతో కారు కొట్టుకుపోయింది. స్థానికులు గమనించి ఏడుగురిని స్థానికులు కాపాడారు. కారు ఈదుల వాగు నుంచి వెళ్తుండగా ఒక్కసారిగా వరదలో కొట్టుకుపోయింది. స్థానికులు తాడు వేసి ఏడుగురిని బయటకు లాగారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. యాదాద్రి భువనగిరి జిల్లా సంగం భీమలింగం దగ్గర మూసీ లెవెల్ వంతెన పైనుంచి ప్రవహిస్తుంది. మూసీ నది వంతెనపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు. హిమాయత్ సాగర్ రిజర్వాయర్ నీటి మట్టం పూర్తిస్థాయికి పెరగడంతో నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని అధికారులు విడుదల చేశారు. దీంతో మూసీ ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో పరీవాహక ప్రజలకు అధికారుల హెచ్చరికలు జారీ చేశారు. హుస్సేన్ సాగర్ కూడా పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరింది.

# ఆధారాలు చూపించు, లేదంటే క్షమాపణ చెప్పు

## : బండి సంజయ్ పై కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్,ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తనపై చేసిన ఆరోపణలను 48 గంటల్లోగా వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బండి సంజయ్‌పై పరువునష్టం దావా వేసి కోర్టుకు ఈడుస్తానని కేటీఆర్ గట్టిగా హెచ్చరించారు. ఈ మేరకు త్వరలోనే ఆయనకు అధికారికంగా లీగల్ నోటీసులు పంపనున్నట్లు స్పష్టం చేశారు.కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాజకీయ లబ్ధి కోసమే తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలకు సంబంధించి ఒక్కటంటే ఒక్క ఆధారం ఉన్నా బయటపెట్టాలని సవాల్ విసిరారు. కేవలం తన ఢిల్లీ బాస్‌లను మెప్పించడం కోసమే బండి సంజయ్ ఇలాంటి వీధి డ్రామాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ఈ సందర్భంగా బండి సంజయ్ తీరుపై కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న వ్యక్తికి ఇంటెలిజెన్స్ పనితీరుపై కనీస అవగాహన అటుంచి, సాధారణ పరిజ్ఞానం కూడా లేదు. ఆయన వ్యాఖ్యలు హద్దులు మీరుతున్నాయి" అని విమర్శించారు. "ఢిల్లీ బాస్‌ల చెప్పులు మోసినంత సులభం కాదు బాధ్యతాయుతమైన మంత్రి పదవిని నిర్వహించడం," అంటూ ఎద్దేవా చేశారు. బండి సంజయ్ చేస్తున్న అసత్య ప్రచారాలు ఆయన స్థాయిని మరింత దిగజార్చుతున్నాయని కేటీఆర్ అభిప్రాయపడ్డారు.

# ఆవరిస్తున్న క్యుములో నింబస్

(మొదటి పేజీ తరువాయి)

ఇక క్యుములో నింబస్ మేఘాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇవాళ సాయంత్రం, రాత్రి సమయాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం సాయంత్రం కూడా నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. నిన్నటి అంత వర్షం కురిసే అవకాశం లేదని స్పష్టం చేశారు. మధ్యాహ్నం వరకు ఎలాంటి వర్ష సూచన లేదన్నారు. సాయంత్రం వేళ పలుచోట్ల ఉరుములు, మెరుపులు సంభవించనున్నాయి.మరో ఐదు రోజులపాటు- తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. 9, 10 తేదీల్లో నల్గొండ, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. 11, 12వ తేదీల్లో తెలంగాణవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు కరిసే అవకాశం ఉందని తెలిపింది. 13వ తేదీన తెలంగాణలోని అన్ని జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

# 10న బిజెపిలో చేరుతున్నా: గువ్వల

**హైదరాబాద్,ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** భాజపా సిద్ధాంతం, లక్ష్యం నచ్చే ఆ పార్టీలో చేరనున్నట్లు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తెలిపారు. భాజపా రాష్ట్ర కార్యాలయానికి వెళ్లిన ఆయన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో భేటీ- అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టు 10న భాజపా రాష్ట్ర చీఫ్ రామచందర్‌రావు సమక్షంలో తాను ఒక్కడినే ఆ పార్టీలో చేరుతానని చెప్పారు. అచ్చంపేటలో ఎవరు ఎన్ని సభలు, సమావేశాలు పెట్టుకున్న తనని ఏమీ చేయలేరని వ్యాఖ్యానించారు. బీజేపీలో గువ్వల చేరికను రాంచందర్ రావు అధికారికంగా ప్రకటించారు. గువ్వల ఈనెల 10వ తేదీన కమలం పార్టీలో చేరనున్నారు. ఆయనతోపాటు- మరికొంతమంది బీఆర్ఎస్ నాయకులు కూడా బీజేపీలో చేరే అవకాశం కనిపిస్తోంది. బీఆర్ఎస్‌ను గువ్వల బాలరాజు వీడిన తర్వాత ఆ పార్టీపై సంచలన ఆరోపణలు చేశారు. తనను చంపుతానంటూ వేలాది ఫోన్లు వచ్చాయని, ఇంత జరిగినా బీఆర్ఎస్‌లో ఎవ్వరూ తనను పట్టించుకోలేదని బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఫామ్ హౌస్ కేసులో వంద కోట్లకు అమ్ముడు పోయానంటూ తనపై అబాండాలు మోపారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల ప్రకారమే తనకు ఇచ్చిన రోల్‌ను ఫాంహౌస్‌లో పోషించానని, ఆ విషయం పార్టీ పెద్దలకూ తెలుసని వెల్లడించారు.

# బిజెపికి తొత్తుగా ఎన్నికల సంఘం

(మొదటి పేజీ తరువాయి)

బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం మరోసారి ఎన్నికల సంఘాన్ని తీవ్రంగా విమర్శించారు .ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే ప్రజలు చైతన్యంతో ఉండాలని, ఈ ఎన్నికల్లో న్యాయం నిలవాలంటే అధికార యంత్రాంగం కక్ష సాధింపులు చేయకుండా వ్యవహరించాలంటూ రాహుల్ గాంధీ హితవు పలికారు. అంతేకాదు, కర్ణాటకతో పాటు- ఇతర రాష్ట్రాల్లో కూడా ఇలాంటి మోసాలు జరుగుతున్నాయని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలో మీరు రాజ్యాంగాన్ని తాకాలని అనుకుంటే, ఒకసారి ఆలోచించాలని సూచించారు. ఈ విషయంలో మీరు ఎంత తెలివిగా దాక్కున్నా, మేము మిమ్మల్ని పట్టుకుంటామన్నారు. ఇందుకు కొంచెం సమయం పట్టొ-చ్చు, కానీ తప్పకుండా పట్టుకుంటామని రాహుల్ గాంధీ ఎన్నికల సంఘానికి వార్నింగ్ ఇచ్చారు. ఎన్నికలు దేశ గుండె చప్పుడని, అలాంటి క్రమంలో ఒక్క ఓటు- దొంగిలించబడినా అది జనాభా గొంతును నొక్కేయడమేనని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో ఇలాంటి ఘటనలు జరిగితే, అది రాష్ట్ర ప్రజలకు మాత్రమే కాదు, దేశ వ్యాప్తంగా డెమాక్రసీకి సవాల్‌గా మారుతుందన్నారు. నిజంగానే ఎన్నికల సంఘం ఎవరి పక్షం వైపు ఉందని ప్రశ్నలు పలువురిలో వచ్చే అవకాశం ఉంది. ఇది ఒక్క కర్ణాటక సమస్య మాత్రమే కాదు. దేశవ్యాప్తంగా ఎన్నికల సమగ్రత గురించి చర్చకు దారితీస్తుంది. కానీ, రాహుల్ గాంధీ ఇక్కడితో ఆగలేదు. ఆయన రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దాన్ని కాపాడటానికి తాము ఎంతకైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘానికి రాహుల్ గాంధీ ఐదు ప్రశ్నలు సంధించారు. డిజిటల్ ఓటర్ల జాబితాను ఎందుకు దాచి పెడుతున్నారు?. సీసీ పుటేజీని ఎందుకుఎవరి ఆదేశాలతో తొలగిస్తున్నారు? నకిలీ ఓట్ల నమోదును ఎందుకు అడ్డుకోలేకపోతున్నారు. విపక్షాలను ఈసీ ఎందుకు భయపెడుతోంది. భాజపా ఏజెంట్‌గా ఈసీ మారిపోయిందా?అంటూ ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భారత ప్రజాస్వామ్యం ఎంతో అమూల్యమైనదని ఈ సందర్భంగా రాహుల్ అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానంలోని మహదేవపుర అసెంబ్లీ స్థానంలో లక్ష కంటే ఎక్కువ దొంగ ఓట్లున్నాయి. ఎన్నికల సంఘం బిజెపితో కుమ్మక్కయ్యిందని రాహుల్ ఆరోపించారు. 40 మందితో కూడిన బృందం ఆరు నెలలపాటు- నిర్వహించిన విశ్లేషణలో వేలాది నకిలీ ఎంట్రీలు, నకిలీ చిరునామాలు చెల్లని ఫొటోలు, అనుమానాస్పద ఫారం 6 దరఖాస్తులు బయట పడ్డాయని రాహుల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే, కెసి వేణుగోపాల్, సిఎం సిద్దరామయ్య, డిప్యూటి సిఎం డికె శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే రాహుల్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. తను చేసే వాదనలను ధృవీకరిస్తూ అధికారిక ప్రకటనపై సంతకం చేయాలి లేదా దేశానికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఎన్నికల సంఘం సవాల్ విసిరింది. రాహుల్ గాంధీ దగ్గర రెండు ఆప్షన్‌లే ఉన్నాయి. ఒకటి ఆయన చేసే ఆరోపణలు నిజమనుకుంటే.. డిక్లరేషన్‌పై సంతకం చేయడం లేదా.. ఇసిఐపై అసంబద్ధ ఆరోపణలు చేసినందుకు దేశానికి క్షమాపణలు చెప్పడం అని ఎన్నిక సంఘం వర్గాలు తెలిపాయి.

# బిజెపితో బిఆర్ఎస్ పొత్తు సాధ్యమేనా?

(మొదటి పేజీ తరువాయి)

వంటి విషయాలు కెసిఆర్‌ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. అందుకే దీనిని నుంచి బయటపడే మార్గాల గురించి ఆలోచన చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. కాంగ్రెస్ ప్రధానంగా ఈ రెండు పార్టీల మధ్య అవగాహన ఉందన్న ప్రచారం జోరు పెంచింది. ప్రధానంగా రేవంత్ సిఎం కావడాన్ని బిఆర్ఎస్ తట్టుకోలేక పోతోంది.ఈ క్రమంలో దీనికి చెక్ పెట్టాలన్న ఆలోచన నుంచే బిజెపికి చేరువ కావాలన్న సూత్రం పుట్టిందన్న ప్రచారం సాగుతోంది. బిసి రిజర్వేషన్ల విషయంలో బిఆర్ఎస్, బిజెపి రెండూ ఒక్కటేనని కాంగ్రెస్ విమర్శిస్తోంది. బిజెపికి దగ్గర కావడానికి బిఆర్ఎస్ యత్నించిందని కవిత కూడా సంచలన ఆరోపణలు చేసింది. ప్రధానంగా రెండు విషయాలపై బిఆర్ఎస్‌లో అంతర్గతంగా చర్చ సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ బిఆర్ఎస్ అంటే కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు లాంటి వారి మధ్యనే అని గుర్తించాలి. ఇకపోతే ఎమ్మెల్యేల అనర్హతపై బిఆర్ఎస్ పట్టుబడుతోంది. మూడునెలల సమయం ఇవ్వడంతో దీనిని గట్టిగా ప్రచారం చేస్తోంది. ప్రస్తుత రాజకీయాలను మలుపు తిప్పాలన్నదే వారి ఎత్తుగడగా ఉంది. బిఆర్ఎస్‌కు రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు. ఐదుగురిలో కేశవరావు జారుకుని రాజీనామా చేశారు. బిజెపికి కూడా రాజ్యసభలో బలం అవసరం. నలుగురు రావడం అంటే తక్కువేమీ కాదు. అందుకే బిఆర్ఎస్, బిజెపిల విలీనపై ఈ మధ్య పుంఖానుపుంఖాలుగా వార్తలు వస్తున్నాయి. ఇందులో ప్రధానంగా బిఆర్ఎస్ విలీనం అయితే కెసిఆర్ కేంద్రమంత్రిగా ఢిల్లీకి వెళ్లడం.. ఒప్పందంగా ఉండొచ్చు. తదుపరి కాలంలో తెలంగాణలోనూ షిండేలను సృష్టించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అన్నది కావచ్చు. ఇవన్నీ కూడా ఊహాజనితమే అయినా ..వీటిచుట్టే ప్రచారం సాగుతోంది. బిఆర్ఎస్, బిజెపి ఎమ్మెల్యేలు కలిశాక వారి బలం ఇప్పుడున్న పరిస్థితుల్లో 36కు చేరుకుంటుంది. ఓ పదిమంది కాంగ్రెస్‌లో చేరారు. వారిని కూడా వెనక్కి రప్పించడం జరగవచ్చు. లేదా కోర్టు ద్వారా ఒకరిద్దరి పై వేటు వేయించి దారికి తెచ్చుకునే ప్రయత్నాలు కూడా సాగుతున్నాయి.అందుకే తెలంగాణ రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయనే భ్రమను కలిపిస్తున్నాయి. భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీల మధ్య విలీన చర్చలు జరుగుతున్నాయని విస్తృత ప్రచారం ప్రారంభమయింది. గత నాలుగైదు నెలలుగా ఈ తరహా ప్రచారం అంతర్గతంగా సాగుతోంది.కానీ ఎవరూ స్పందించలేదు. ఇప్పుడు ప్రచారం మరింత ఊపందుకుంది. అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం ఖండించారు. ఓ ట్వీట్ ద్వారా వీలైనంత బలంగా విలీనం ప్రచారం కుట్ర పూరిత ప్రచారం అన్నారు కానీ.. ఆ వాదనలో బలం ఉందని రాజకీయవర్గాలు భావించడం లేదు. బీఆర్ఎస్ పార్టీ విలీనంపై జరుగుతున్న ప్రచారాన్ని తిప్పి కొట్టడానికి బీఆర్ఎస్ వ్యూహాత్మక నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అందుకే ఎక్కువ మంది విలీన చర్చలు నిజమేనని అనుకుంటున్నారు. గతంలో కెటిఆర్, హరీష్ రావుల ఢిల్లీ టూర్‌పై కాంగ్రెస్ పార్టీ సెటైర్లు వేసింది. రేవంత్ రెడ్డి అయితే పార్టీని తాకట్టు పెట్టడానికి వెళ్లారని విమర్శించారు. బీజేపీ నేతల కోసం పడిగాపులు పడుతున్నారని మండిపడ్డారు. బీజేపీతో కలిసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శలు గుప్పించారు. అయితే ఈ విషయంలో బీఆర్ఎస్ వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇదే క్రమంలో సుప్రీం తీర్పుకు అనుగుణంగా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హతా వేటు వేయించేందుకు న్యాయనిపుణులతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి నిప్పులేనిదే పొగరాదు. ఎక్కడో ఒకచోట ఏదో ఒక సందర్భం లేకుండా ఇలాంటి వార్తలు రావు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఎలాంటి పొత్తు చర్చలు జరగకపోతే.. ఈ విషయాన్ని ఖండించడానికి రెండు పార్టీలు ఎందుకు తటపటాయిస్తున్నాయన్నది రాజకీయవర్గాల నుంచి వస్తున్న మొదటి ప్రశ్న. నిర్మొహమాటంగా ఖండించడానికి బీఆర్ఎస్ ముఖ్య నేతలు సిద్దంగా లేరు. బీజేపీతో పొత్తు లేదా విలీనం అంటూ జరుగుతున్న ప్రచారంపై స్పందించడానికి నిరాకరిస్తున్నారు. తెలంగాణ కోసం రాజీలేని పోరాటం చేస్తామని కెటిఆర్ చెబుతున్నారు. తెలంగాణ ఉన్నంతవరకు గులాబీ జెండా ఎగురుతుందన్నారు. కాంగ్రెస్‌కు బిజెపి సహకరిస్తోందని కూడా ఎదురుదాడి చేస్తున్నారు. విలీనం లేదా పొత్తు కుదిరితే బీఆర్ఎస్ పార్టీకి ఉన్న క్యాడర్ బలం..బీజేపీకి కలసి వస్తుందని.. కింది స్థాయి వరకూ పార్టీ నిర్మాణం ఏర్పడుతుందని ..ఇతర సీనియర్ నేతలు పాజిటివ్‌గా స్పందిస్తున్నారని అంటున్నారు. అయితే బీఆర్ఎస్ క్యాడర్ మాత్రం.. అలాంటి పరిస్థితి రాదని.. కేసీఆర్ తన పార్టీని ఇతర పార్టీల్లో కలిపేంత నిర్ణయం తీసుకోరని, పొత్తులకు కూడా దూమని అంటున్నారు. రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

# ఫోన్ ట్యాపింగ్‌లో వేలకోట్ల వల : బండి సంజయ్

(మొదటి పేజీ తరువాయి)

నా కుటుంబ సభ్యులు, పని మనుషుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. భార్యాభర్తల ఫోన్లూ ట్యాప్ చేసి విన్నారు. నా వద్ద ఉన్న ఆధారాలు, సమాచారం అధికారులకు ఇచ్చాను. వాస్తవానికి మావోయిస్టులకు సంబంధించిన ఫోన్లు ట్యాప్ చేయాలి. కానీ, ఆ జాబితాలో మా పేర్లు పెట్టి ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మొదటిసారి వాంగ్మూలం ఇచ్చింది నేనే. కేసీఆర్ ప్రభుత్వం విచ్చలవిడిగా ఫోన్లు ట్యాప్ చేసింది. కేసీఆర్ కుమార్తె, అల్లుడి ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. గత ప్రభుత్వంలో సాధారణ ఫోన్ కాల్స్ మాట్లాడేందుకు భయపడి వాట్సప్ కాల్స్ మాట్లాడేవాళ్లు. అప్పటి భారత రాష్ట్ర సమితి మంత్రులు, ఎమ్మెల్యేల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని బండి అన్నారు. కేసీఆర్ కుమార్తె, అల్లుడి ఫోన్లు ట్యాప్ చేశారు. వారినీ విచారణకు పిలవాలి. ఎస్ఐబీని సొంత అవసరాలకు అడ్డాగా కేటీఆర్ మార్చారు.నాయకులు, లాయర్లు, వ్యాపారులు, సినీ నటులు,ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. టీ-ఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు విచారిస్తున్న హైకోర్టు జడ్జి ఫోన్ కూడా ట్యాప్ చేశారు. ఫోన్ల ట్యాపింగ్ ద్వారా అనేక లావాదేవీలకు సంబంధించి లబ్ధి పొందారు. ప్రభాకర్‌రావు, రాధా కిషన్‌రావు బాగోతం చెబుతుంటే నాకే సిగ్గనిపించింది. వారిద్దర్నీ సమాజం క్షమించదు. ఇద్దరికీ ఉరిశిక్ష వేస్తే ఒకేసారి చనిపోతారు.. క్షణక్షణం బాధపడాలి. మా కార్యకర్తలను, ఇతర పార్టీ నాయకులను క్షోభకు గురి చేశారు. ఇద్దరు నిందితులను కాపాడే ప్రయత్నం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోంది. వ్యాపారుల లావాదేవీలు తెలుసుకొని కేటీఆర్ బ్లాక్‌మెయిలింగ్ చేశారని బండి అన్నారు.ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్లు దోచుకున్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి వద్ద రూ.7 కోట్లు- పట్టుకున్నారు. ఆ డబ్బు ఏమైందో తెలియదు. చాలామంది నాయకుల వద్ద రూ.వందల కోట్లు- సీజ్ చేసి పట్టుకున్నారు. పట్టుబడిన డబ్బులను కేసీఆర్, కేటీఆర్‌కు ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు పంపారు. రూ.20 కోట్లు- దొరికితే.. కేసీఆర్, కేటీఆర్ ఫోన్ చేశాక రూ.2 కోట్లు- అవుతాయి. రూ. వేల కోట్లు- అక్రమాలు జరిగితే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకోదా? ఈడీకి లేఖ రాస్తే విచారణ జరుపుతుంది. సిట్ అధికారులు నిజయితీ పరులు, వారిపై మాకు అనుమానం లేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపైనే మా అనుమానం అంతా. ఫోన్లు ట్యాప్ చేసినట్లు- ఆధారాలున్నా ఎంతకాలం గడుపుతారు. కమిషన్లు వేసి కాలయాపన చేస్తారు. నివేదికలు ఇచ్చినా చర్యలు లేవు. ఏడాది గడిచినా ఒక్క నాయకుడిని అరెస్టు చేయలేదని బండి సంజయ్ అన్నారు. తన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి సిట్ అధికారులు అందించిన వివరాలు చూసి తాను షాక్ అయినట్లు- మంత్రి బండి సంజయ్ తెలిపారు. తన ఫోన్, తన కుటుంబ సభ్యులతోపాటు- తన ఓఎస్డీ, వ్యక్తిగత సిబ్బంది ఫోన్ ట్యాప్ అయినట్లు- చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్ అవుతున్నట్లు- తాను గుర్తించానని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తన ఫోన్లు ఎక్కువ సార్లు ట్యాప్ చేశారని పేర్కొన్నారు. మావోయిస్టుల జాబితాలో తమ పేర్లు పెట్టి ట్యాప్ చేశారని మండిపడ్డారు. పార్టీ కార్యకర్తల నుంచి రాష్ట్ర స్థాయి నాయకులతో తాను మాట్లాడిన అన్ని కాల్స్ ట్యాప్ చేశారని వివరించారు. టీ-బీజేపీ చీఫ్‌గా ఉన్న సమయంలో తన చుట్టూ నిఘా పెట్టారని విమర్శించారు. వావివరసలు లేకుండా ఫోన్లు ట్యాప్ చేశారంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ ఫోన్ల ట్యాపింగ్ వెనుక బీఆర్ఎస చీఫ్ కేసీఆర్ పాత్ర ఉందని కుండ బద్దలు కొట్టారు. కేసీఆర్ పాలనలో సామాన్యులు సైతం ఫోన్లు మాట్లాడ లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో భార్యాభర్తల ఫోన్ సంభాషణలూ కూడా విన్నారంటూ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలకంగా వ్యవహరించిన ప్రభాకర్ రావు, రాధాకిషన్ రావులకు ఉరిశిక్ష విధించాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ నిందితులను రేవంత్ ప్రభుత్వం కాపాడుతోందని ఆరోపించారు. వ్యాపారస్తుల ఫోన్లు ట్యాప్ చేసి బ్లాక్‌మెయిల్ చేశారన్నారు. ఎన్నికల సమయంలో దొరికిన నగదంతా కేసీఆర్ ఖాతాల్లోకి వెళ్లాయని ఆరోపించారు. ఈ కేసును ఇంకా ఎంత కాలం సాగదీస్తారు? అంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ కేసులో ఇప్పటివరకు కేసీఆర్ కుటుంబంలో ఒక్కరినైనా అరెస్టు చేశారా? అంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బండి సంజయ్ నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని సిట్ కార్యాలయంలో అధికారుల విచారణకు కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. దాదాపు రెండు గంటలపాటు- బండి సంజయ్‌ను సిట్ అధికారులు ప్రశ్నించారు. ఈ కేసులో సాక్షిగా బండి సంజయ్ అందించిన వాంగ్మూలాన్ని వారు రికార్డు చేశారు. అందుకు సంబంధించిన ఆధారాలను సిట్ అధికారులకు బండి సంజయ్ అందజేశారు. తెలంగాణ బీజేపీ చీఫ్ అయినప్పటి నుంచి మీ ఫోన్ ట్యాప్ అయినట్లు- బండి సంజయ్‌కు సిట్ అధికారులు వివరించారు. అలాగే ఎవరితో ఎంత సేపు మాట్లాడారన్న డేటాను సైతం ఆయనకు వారు సాక్ష్యాలతో సహా చూపించారు. మునుగోడు, హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో రాజకీయ నేతలతో బండి సంజయ్ మాట్లాడిన డేటాకు సంబంధించిన వివరాలను ఆయనకు సిట్ అధికారులు ఈ సందర్భంగా అందజేశారు.

# శ్రీ నారాయణ హై స్కూల్ లో రాఖీ పౌర్ణమి వేడుకలు



**గణపురం/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** ఆదర్శవాని విద్యాసంస్థలలో ఒకటైన ఘనపూర్ లోని శ్రీ నారాయణ హై స్కూల్ లో రాఖీ పౌర్ణమి వేడుకలు శుక్రవారం సాంప్రదాయపూరితంగా, ఎంతో ఉత్సాహంగా జరిపారు. విద్యార్థులు పరస్పరం రాఖీలు కట్టి, ప్రేమ, అనుబంధాన్ని చాటుకున్నారు. చిన్నారుల నుండి మాధ్యమిక విద్యార్థుల వరకు అందరూ ఈ వేడుకల్లో సక్రమంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన నృత్యాలు, పాటలు, అభినయ కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. స్కూల్ టీచర్లు, స్టాఫ్, తల్లిదండ్రుల సానుకూలతతో ఈ కార్యక్రమం మరింత వైభవంగా మారింది. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ నారాయణ హై స్కూల్ చైర్మన్ శ్రీ నాగనబోయిన రవి మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని చాటుతుంది. సోదర %-% సోదరీల మధ్య ప్రేమ, రక్షణ భావనను బలపరిచే ఈ పండుగను పాఠశాల స్థాయిలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉంది. పిల్లల్లో చిన్ననాటి నుంచే మంచి విలువలు, సంస్కారం పెంపొందించడమే మా లక్ష్యం. విద్యతో పాటు మానవీయ విలువలు నేర్పే విద్యా పద్ధతిని అందిస్తున్నందుకు గర్వంగా ఉందిఅని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి నారాయణ హై స్కూల్ డైరెక్టర్/ప్రిన్సిపాల్ శ్రీ పోతుగంటి శశిధరచారి, అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జ్ స్వప్న చారి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా సామూహిక కుంకుమార్చన

## శ్రావణమాస ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు










**గణపురం/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** గణపురం మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది అదేవిధంగా ఆలయంలో అంగరంగ వైభవంగా మహిళలు శ్రీ సీతమ్మ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమం నిర్వహించడం పూజ అనంతరం మహిళలు అందరూ కలిసి సీతమ్మ అమ్మవారికి వాయనం ఇచ్చుకుంటా వడి నింపే కార్యక్రమాన్ని జరుపుకున్నారు అదేవిధంగా మహిళలందరూ కలిసి వాయినాలు ఇచ్చి పుచ్చుకోవడం జరిగింది మహిళలు మాట్లాడుతూ మా ఇంట సిరిసంపదలు సౌభాగ్యాన్ని పొందటం కొరకు శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక కుంకుమార్చనను ప్రతి సంవత్సరం ఇదే విధంగా జరుపుకుంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో గణపురం ఆర్యవైశ్య సంఘం మహిళలు ఆలయ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ ఆలయ కమిటీ సభ్యులు తదితర భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

**వరలక్ష్మి వ్రతాలు జరుపుకున్న భక్తులు**

అదేవిధంగా వినయ్ హాస్పిటల్ నిర్వాహకులు చిలుమల్ల స్వరూప సంపత్ కుమార్ దంపతులు శ్రావణ శుక్రవారం సందర్భంగా వైభవపీతంగా శ్రీ వర లక్ష్మి అమ్మవారి పూజా కార్యక్రమం జరుపుకోవడం జరిగింది అదేవిధంగా మహిళలను ఆహ్వానించి వారికి స్వరూప సంపత్ కుమార్ దంపతులు ముత్తయిదులుకు వాయనాలు ఇవ్వటం జరిగింది అదేవిధంగా డాక్టర్ సంపత్ కుమార్ స్వరూప దంపతులు మాట్లాడుతూ ఎంతో ప్రీతికరమైన శ్రావణ మాసంలో ప్రతి సంవత్సరం ఈ వరలక్ష్మి అమ్మవారి వ్రతము నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది అని తెలిపారు ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఫ్రెండ్స్ ఫ్యాషన్స్ రెడీమెడ్ షాప్ ని ప్రారంభించిన కట్టా






## -ఉమెన్స్, మెన్స్, కిడ్స్ వేర్.

**కల్లూరు/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** పట్టణ లో మధిర రోడ్డు నందు నూతనంగా ఫ్రెండ్స్ ఫ్యాషన్స్ ఉమెన్స్,కిడ్స్ వేర్ రేడిమెడ్ బట్టల షాప్ ను ప్రారంభించిన మాజీ జడ్పీటీసీ కట్ట అజయ్ కుమార్. ఈ సందర్భంగా కట్టా అజయ్ కుమార్ మాట్లాడుతూపట్టణంలో ఫ్రెండ్స్ ఫ్యాషన్స్ దుకాణాలు మట్టా కృష్ణారావు, రమేష్ కలసి గత కొన్ని సంవత్సరాలుగా వినియోగదారులకు సరసమైన ధరలలో దుస్తులు అందించడంలో పేరుగాంచటం చాలా సంతోషకరం. అదే ఉత్సాహంతో ఈ రోజున రెండవ షాపు ప్రారంభించిన శుభ తరుణంలో నన్ను ఆహ్వానించడం చాలా సంతోషకరం. ఇవి రెండు దుకాణాలు దిన దిన అభివృద్ధి చెంది అధిక లాభాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేసినారు.

షాపు యజమాని కృష్ణారావు, రమేష్ లు మాట్లాడుతూ మావద్ద టాప్స్ లెగ్గిన్స్ శారీస్ జీన్స్ టీషర్ట్స్ షర్ట్స్ సరసమైన ధరలకు లభించును. వినియోగదారులే దేవుళ్ళుగా మేము వ్యవహరించి ప్రతి ఒక్కరి మన్ననలు పొంది ఈరోజున ఇదే పట్టణంలో రెండో షాపు ప్రారంభించుటకు చాలా సంతోషం ఇస్తున్నాము. మా వినియోగదారుల్ని దేవుళ్ళుగా భావించి వారికి సరసమైన ధరల్లో ఇవ్వగలమని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోటకూర శేఖగిరిరావు, మట్టా నరసింహారావు, మట్టా శేషమ్మ,మట్టా చంద్రకళ, మట్టా గౌరమ్మ, పోట్టపర్తి శ్రీనివాసరావు, ఆంజనేయులు, పాశం వీరబాబు, కిషోర్, బానోత్ రామదాసు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రాబెల్ మోడల్ హై స్కూల్లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు





**గణపురం/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):**గణపురం మండల కేంద్రంలోని ఫ్రా బెల్ మోడల్ హై స్కూల్ లో శు క్రవారం ముందస్తు రక్షాబంధన్ వేడుకల్ని జరుపుకోవడం జరిగింది ఈ కార్యక్రమం ముందుగా విద్యార్థిని విద్యార్థులకు సాంప్రదాయ రీతిలో నుదుటిన కుంకుమ తిలకం దిద్ది రక్షాబంధన్ కావించారు తర్వాత విద్యార్థినిలు విద్యార్థులు ఉపాధ్యాయులు నీవు నాకు రక్ష నేను నీకు రక్ష మనమంతా దేశానికి రక్ష అని నినాదాలతో పాఠశాల గ్రౌండ్లో హోరెత్తించారు స్వీట్లు పంచారు తర్వాత పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్ కృష్ణ సార్ మాట్లాడుతూ మనమంతా కులమత బేధాలు లేకుండా జరుపుకునే పండుగ మనం ఐక్యంగా ఉండి మన జాతిని మన దేశాన్ని కాపాడుకోవాలని విద్యార్థిని విద్యార్థులు సోదర భావం కలిగి ఉండాలని మన సంస్కృతిని కాపాడుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

# అల్ఫోర్స్ జీనియస్ స్కూల్లో ముందస్తు రక్షాబంధన్, వరలక్ష్మీ వ్రతం వేడుకలు





**హుజురాబాద్/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):**

హుజురాబాద్ పట్టణం లోని అల్ఫోర్స్ జీనియస్ స్కూల్ లో శుక్రవారం ముందస్తు రక్షాబంధన్ పండుగను అలాగే వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టి సోదర, సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమ, పరస్పర రక్షణ భావాన్ని చాటిచెప్పారు. అలాగే వరలక్ష్మీ వ్రతం సందర్భంగా బాలికలు సాంప్రదాయ వస్త్రధారణలో లక్ష్మి ,అమ్మవారి వేషధారణలో పాల్గొని పూజా కార్యక్రమాలు చేశారు. ఈ వేడుకల ద్వారా విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల పట్ల అవగాహన కలిగించేలా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాఖీ పండుగని తమ పాఠశాలలో ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించుకుంటామని, తన పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు సోదరి సోదర భావం కలిగేలా క్రమశిక్షణతో మెలుగుతారని అలాగే కేవలం మన సొంత వారితోనే కాకుండా అందరితో సోదర భావంతో మెలగాలని అప్పుడే మన భారతీయ సాంప్రదాయ విలువలతో మరింత ముందుకు వెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# పూడిక తీత పనులు పర్యవేక్షించిన మట్టా దయానంద్ విజయ్ కుమార్





**సత్తుపల్లి/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** బేతుపల్లి పెద్ద చెరువు ప్రధాన కాలువలో జేసీబీ ద్వారా పూడిక మట్టి తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద విజయ్ కుమార్ పనులను పర్యవేక్షించి పరిశీలించారు. పంట కాలువల శుభ్రత పనులు వేగంగా చేపట్టాలని ఆయన ఆదేశించారు. చివరి ఆయకట్టు రైతులకు సాఫీగా పంట సేద్యానికి నీరందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివా వేణు, కాంగ్రెస్ నాయకులు దొడ్డా శ్రీనివాసరావు, బాల సత్యనారాయణ, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# గంజాయి వద్దు.. ఆరోగ్యం ముద్దు

## పట్టణంలో విస్తృతంగా సామాజిక కార్యకర్త వేణుగోపాల్ ప్రచారం.




**హుజురాబాద్/ఆగస్ట్8(జర్నలిస్ట్ వార్త):** గంజాయి వద్దు ఆరోగ్యం ముద్దు అంటూ హుజురాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ శుక్రవారం పట్టణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గంజాయి వద్దు ఆరోగ్యం వద్దు ఆ అనే బోర్డును తన మెడలో వేసుకుని సబ్ రిజిస్టర్ ఆఫీసు ఎస్సార్ ఆసుపత్రి ఏరియా, భరత్ పంప్ ఏరియా, సిర్సపల్లి క్రాస్ రోడ్ తదితర ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డు గ్రహీత నలుబాల వేణుగోపాల్ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి ఇతర నిషేధిత మత్తు పదార్థాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని కోరారు. డ్రగ్స్, గంజాయి ఇతర రాష్ట్రాల నుండి తెలంగాణ రాష్ట్రంలోకి రాకుండా సమూలంగా అరికట్టాలన్నారు. డ్రగ్స్, నిషేధిత మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, అందుకు అనుగుణంగా ఇటీవల ఉక్కు పాదం మోపుతోందని గుర్తు చేశారు. ప్రజల ప్రాణాలు కాపాడే వైద్య విద్యను అభ్యసిస్తున్న మెడికోలు గంజాయి మత్తులో తూలుతూ గంజాయినీ సేవించడం ఎంతో బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో క్రమక్రమంగా గంజాయి వినియోగం ఇటీవల పెరుగుతున్నట్లు మీడియా ద్వారా తెలుస్తుందని ఇప్పటికైనా పోలీస్ డిపార్ట్మెంట్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను నిలపాలని వేణుగోపాల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి రమేష్, మడుగు రమేష్, కారంకంటి రవీందర్, ఆదిమూలము అజయ్, కొల్లూరి ఆనంద్, పరకాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమీక్షలను ప్రజలకు అవగాహన కల్పించాలి



**తల్లాడ/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మండలం లోని మల్లారం గ్రామంలో గృహములలో వస్త్రములు ఎండపెట్టుకునే మరియు ఇతర అవసరముల నిమిత్తమై కట్టుకునే దండెములు ఇనుప తీగతో కట్టటం వలన గృహములోని విద్యుత్ వైరింగ్ తీగలు, ఫాన్లు లేక నీటి మోటర్లు షార్ట్ అయినప్పుడు వాటినుంచి రిటర్న్ విద్యుత్ సరఫరా జరిగి బట్టలు ఎండవేస్తున్న ఇనుపతీగ ద్వారా షాక్ తగిలి ఎంతోమంది మృత్యువాత పడటం జరుగుతున్నది. ఇట్టి సంఘటనలను నివారించుటకు మరియు వినియోగదారులకు మరియు ప్రజలకు అవగాన కల్పించి ఇనుపతీగ దండెము స్థానంలో ప్లాస్టిక్ లేక నైలాన్ వైరును దండెము గా కట్టుట వలన ప్రయోజనములపై అవగాహన మరియు చైతన్య పరచు కార్యక్రమము ఏర్పాటు చేయనైనది. ఇట్టి కార్యక్రమములో తల్లాడ విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ ఆర్ ప్రసాద్, విద్యుత్ శాఖ సిబ్బంది, మల్లారం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా ఝాన్సీరాజేందర్ రెడ్డి వివాహ మహోత్సవ వేడుక



**రాయపర్తి/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరాజేందర్ రెడ్డి ల వివాహ మహోత్సవ వేడుకలు పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరగగా శుక్రవారం మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపి గజమాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, టిపిసిసి మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి,మాచర్ల ప్రభాకర్,ఆకుల సురేందర్ రావు, పెండ్లి మహేందర్ రెడ్డి,ఉల్లెంగుల యాదగిరి, చిర్ర మల్లయ్య, ఎండి నయీమ్, మాందాటి సుదర్శన్ రెడ్డి, చెవ్వ కాశీనాథం, బిజ్జల సోమన్న, పీరని ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు

# ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు



**రాయపర్తి/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి అన్నారు.శుక్రవారం మండలంలోని గట్టికల్ గ్రామానికి చెందిన కారుపోతుల పిచ్చమ్మ-సుధాకర్ లకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ భూమి పూజ చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తుందని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సొంతింటి కలను నిజం చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎండీ.నయీమ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిర్రమాల్లయ్య,మండల సీనియర్ నాయకులు ఊళ్లేంగల యాదగిరి,మండల నాయకులు చెవ్వ కాశినాథం,గ్రామ పార్టీ అధ్యక్షులు మెరుగు సంతోష్,మండల యూత్ నాయకులు నరసింహుల రామ్మూర్తి ,తదితరులు పాల్గొన్నారు.ద

# మేము మీకు రక్ష... మీరు మాకు రక్ష,

## విశ్వశాంతి లో రక్షాబంధన్ వేడుకలు








**సత్తుపల్లి/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):**స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో శుక్రవారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు.మేము మీకు రక్ష... మీరు మాకు రక్ష " మనందరం ఈ సమాజానికి రక్ష అంటూ విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టారు. సోదర, సోదరీమణుల ఆత్మీయత, అభిమానం, ఆదరణ, ప్రేమానురాగాలకు చిహ్నంగాప్రతి సంవత్సరం శ్రావణమాసం ( ఆగస్ట్) లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించడం భారతీయ సంస్కృతి , సాంప్రదాయంలో భాగం అయిందని విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు ఈ సందర్భంగా విద్యార్థులకు తెలిపారు.రాఖీ కట్టిన వారికి ధైర్యంగా, అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కత్తి పోటులో గాయపడిన సుదర్శన్‌కి దయాకర్ రెడ్డి పరామర్శ




**ఖమ్మం బ్యూరో /ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** ఏదులాపురం : సాయిగణేష్ నగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ యువకుడు మెడికంటి రాజవర్ధన్ రెడ్డి అలియాస్ అర్జున్ రెడ్డి మద్యం మత్తులో గురువారం రాత్రి ఆ కాలనీ సెక్రటరీ మెరుగు భాస్కర్‌తో అకారణంగా వాగ్వాదానికి దిగాడు.ఈ క్రమంలో ఆ గొడవను ఆపాలని ప్రయత్నించిన సుదర్శన్‌పై రాజవర్ధన్ రెడ్డి కత్తితో పొట్టపై, వీపుపై దాడి చేసి గాయపరిచాడు.దీంతో సుదర్శన్‌కు తీవ్ర రక్తస్రావం జరిగింది.గాయపడిన సుదర్శన్‌ను శుక్రవారం ఉదయం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ఆసుపత్రిలో పరామర్శించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకునేలా పోలీసులతో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు.

# న్యూ ఇందిరానగర్ కాలనీలో శ్రీ లలితా త్రిపుర సుందరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు





**హుజురాబాద్/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త)** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం లోని శాలపల్లి ఇందిరానగర్ గ్రామ పంచాయతి పరిధిలో గల న్యూ కాలనీలో కొలువుతీరిన లలితా త్రిపుర సుందరిదేవి ఆలయంలో నేడు వరలక్ష్మి వ్రతం పురస్కరించుకొని వందలాది మంది భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది.దిన దిన అభివృద్ధితో అమ్మవారి మహిమలతో కొలిచిన భక్తులకు కొంగు బంగారంగా నిలుస్తుంది.శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి ఆలయంలో శివుడు,గణపతి,సుబ్రమణ్యస్వామి,జోడి నాగేంద్ర స్వామి,అనుసంధాన దేవత మూర్తులు కొలువై వున్నాయి . ఆలయ ప్రధాన అర్చకులు రేవూరి కళ్యాణ్ రామ్ శర్మ మాట్లాడుతు దినదినం భక్తుల రద్ది పెరుగుతుంది భక్తులు ముడుపులు కట్టి అమ్మవారిని కోతున్న కోరికలను అ జగన్మాత తీరుస్తుంది.ఆలయంలో ప్రతి శుక్రవారం అన్నదానం, కుంకుమ అర్చనలు,అక్షర అభ్యసలు,అమ్మవారి పారాయణం లాంటి కార్యాలు నిత్యం జరుగుతున్నాయి. ఆలయము నిర్మించి 12 సంవత్సరాలు అవుతుంది ఆలయ స్థల ధత ముక్క బుచ్చి మల్లయ్య వారి కుటుంభం దేవాలయ నిర్మాణానికి 20 గుంటల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు.ఆలయ నిర్మాణం మా తండ్రి రేవూరి కృష్ణ ఆధ్వర్యంలో జరిగింది అని తెలిపారు.ముక్యంగా సమస్త భక్త జనం కోరిన కోరికలు తీర్చే ఆ జగన్మాత లలిత దేవి ఇప్పుడు భక్తుల నుంచి సహాయాన్ని ఆశిస్తుంది అని ఆలయ అర్చకులు తెలిపారు దిన దిన భక్తజనం పెరుగుతుండడంతో భక్తులకు కనీసం సావకార్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని, ఆలయంలో నిత్యం ప్రతి శుక్రవారం అన్నదానం నిర్వహిస్తుండడంతో వంట



గదులు,స్టోర్ రూమ్,ఆలయ పూజారికి గది,బోర్,ఆలయం వెనుకాల షెడ్డు నిర్మాణం కు ఆలయ అభివృద్ధికి భక్తులనుంచి ఆ జగన్మాత సహాయాన్ని కోరుతుంది అని తెలిపారు,కనీసం అర్చకులకు ఎలాంటి జిత భత్యాలు లేకుండా గుడిని నమ్ముకొని ఆ జగన్మాత సేవలోనే తన జీవనం కొనసాగుతుంది అని భార్య పిల్లలతో కిరాయి వుంటూ అమ్మవారి సేవలు చేస్తూ కాలనీ గడుపుతున్న అని వివిధ పార్టీల నాయకులూ స్థానిక ఎమ్మెల్యే మరియు ప్రజా ప్రతినిధులు,వ్యాపార వేత్తలు భక్తులు అమ్మవారి ఆలయ అభివృద్ధిలో పలు పంచుకోవాలని,అమ్మవారి కరుణ కటాక్షం ఎప్పుడు మీపై ఉంటుంది అని ఆలయ ప్రధాన అర్చకులు కళ్యాణ్ రామ్ శర్మ కోరారు .

# ఘనంగా సీనియర్ జర్నలిస్ట్ గడ్డం రాజిరెడ్డి జన్మదిన వేడుకలు



**హనుమకొండ/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హన్మకొండ జిల్లా అధ్యక్షుడు, సాక్షి దినపత్రిక ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో చీఫ్, సీనియర్ పాత్రికేయుడు గడ్డం రాజిరెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఘనంగా జరిగాయి. రాజిరెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఆయనను శాలువాతో సత్కరించి శ్రీ వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహూకరించారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, సాక్షి ఎడిషన్ ఇంచార్జ్ వర్థెల్లి లింగయ్య, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, జర్నలిస్టులు తోట సుధాకర్, సాయిరాం, బొడిగె శ్రీను, నరేష్, పొడిచెట్టి విష్ణువర్ధన్, రవీందర్, రాజ్ కుమార్, పొగాకుల అశోక్, ప్రశాంత్, నాగరాజు, ప్రశాంత్, సోమనర్సయ్య, భరత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన హాస్టల్ లోని పారిశుధ్య పనులు

**-కల్లూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆళ్లకుంట నరసింహారావు.**



**కల్లూరు/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):**మున్సిపాలిటీ పరిధిలో గల ఖాన్ ఖాన్ పేట వార్డ్ యన్.యస్.పీ నందు గిరిజన ఆశ్రమ హాస్టల్లో పేరుకుపోయిన,పెరిగిన పిచ్చి మొక్కలను,పూడిపోయిన డ్రైనేజీ వ్యవస్థలను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మరియు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్ట దయానంద్ విజయకుమార్ సూచన మేరకు గిరిజన ఆశ్రమ హాస్టల్ ను సందర్శించి పనులను దగ్గరుండి డోజర్ ట్రాక్టర్ ద్వారా చేయిస్తున్న మండల యూత్ కాంగ్రెస్ నాయకులు ఆళ్లకుంట నరసింహారావు.చదువు కుంటున్న పిల్లలకు ఎలాంటి చిన్న అసౌకర్యం కలిగిన ఎమ్మెల్యే మట్టా రాగామయి దయానంద్ ,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ కి తెలియజేయండి అని హాస్టల్ సిబ్బందికి తెలియచేసారు.కార్యక్రమంలో ఇన్చార్జ్ వార్డెన్ పిఈటి, ఇంద్రమ్మ కమిటీ మెంబర్ పోన్నూరు వెంకటేశ్వరరావు లు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పాలనలోనే పేదలకు సంక్షేమ పథకాలు

**తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డా. తాటికొండ రాజయ్య**





**హనుమకొండ బ్యూరో/ ఆగస్టు8ధర్మసాగర్(జర్నలిస్టు వార్త):** కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిచింది. ప్రతి గ్రామంలో రహదారులు, తాగునీటి సదుపాయం, విద్యుత్, పింఛన్లు, రైతు బంధు, రైతు భీమా, వైద్య సేవలు పేదల కన్నయ్య అని తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డా. తాటికొండ రాజయ్య అన్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని కేశవనగర్, క్యాతంపల్లి, జానకీపురం, తాటికాయల, రాయి గూడెం, కాషగుడెం గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఊరూరికి బీఆర్ఎస్ సంక్షేమాలు %-% ఇంటింటికీ కేసీఆర్ పథకాలు కార్యక్రమం శుక్రవారం జరిగింది ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డా. తాటికొండ రాజయ్య విచ్చేసి మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో పరిస్థితి ఏమైందో ప్రజలు చూస్తున్నారని రైతు బంధు సమయానికి రాదు. ఓట్లు వేయించే సమయంలోనే రైతు బంధు ఇస్తున్నారని అన్నారు.ఇది రైతుల పట్ల మోసం రైతు రుణ మాఫీ పూర్తి కాలేదు, పొరపాటున రైతు చనిపోతే రైతు కుటుంబానికి అండగా 5 లక్షలు వచ్చేవి అది ఇప్పుడు కానరాకుండ పోయింది పోయిందని కేసిఆర్ కిట్ తీసేసి కేవలం పేర్లు మారుస్తూ కమిషన్ల కోసం కాలం గడుపుతూ ఉండాలని అన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కడియం శ్రీహరికి పెద్ద చెంపపెట్టులాంటిది. నిజంగా ఆయనకు నీతి, నిజాయితీ ఉంటే వెంటనే పదవికి రాజీనామా చేసి, ప్రజాక్షేత్రంలో పోటీకి రావాలి. ప్రజలంతా కడియం శ్రీహరి మోసాన్ని అర్థం చేసుకోవాలని కోరారు. ఏ పార్టీలో ఉన్నాడో చెప్పుకోలేని పరిస్థితి లో ఉన్నాడని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మోసపూరిత హామీలతోనే ప్రజలను మభ్యపెడుతుంది. గడిచిన రెండు సంవత్సరాల్లో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదు. ఇలాంటి పార్టీకి ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని అన్నారు.రేవంత్ రెడ్డి ఇప్పటికే 50 సార్లు ఢిల్లీకి వెళ్ళాడు. అక్కడ ఢిల్లీ పెద్దలకు కప్పం కట్టి వస్తున్నాడు. ప్రజలకు సేవ చేయడానికి కాదు, తన కుర్చీ కాపాడుకోవడానికి మాత్రమే ఆయన పరుగులు పెడుతున్నారని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు తెలంగాణ రైతు గర్వంగా ఉండేవాడు. ఆ రోజులు మళ్లీ రావాలి అంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాలి. అందరూ ఒక్కటిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుదేవ్ ను సన్మానించిన పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ



**హనుమకొండ బ్యూరో/ఆగస్టు 8/**ధర్మసాగర్ (జర్నలిస్టు వార్త):రాష్ట్ర స్థాయి 1000 మీటర్స్ మిడ్ రిలే పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించిన, ప్రభుదేవ్ ను పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ ఘనంగా శుక్రవారం సన్మానించారు. ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన,ఎమ్మార్పీఎస్ ఉద్యమ కారుడు గంగారపు శ్రీనివాస్ ప్రశాంత దంపతుల కుమారుడు గంగారపు ప్రభుదేవ్,10వ తరగతి సెయింట్ గాబ్రీయేల్ స్కూల్ ఫాతిమానగర్ స్కూల్ నుండిహనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన,సౌత్ జోన్ తెలంగాణ స్టేట్ మీట్ లో అండర్ 16 విభాగంలో 1000 మీటర్స్ రిలే జరుగబోయే జాతీయ స్థాయి పరుగు పందెంలో కూడ ప్రథమ స్థానంలో గెలుపొందాలని ఆశీర్వదించారు.

# అపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న చిన్నారులు



**వరంగల్/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** అపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న చిన్నారులు గద్దల సంపత్ (35) తండ్రి ఎల్లయ్యఅవుతాపురం మండలం పెద్ద వంగర జిల్లా మహబూబాద్ నిరుపేద ఎస్సి కమ్యూనిటీ చెందిన వ్యక్తి ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించడం జరిగింది సంపత్ కు ముగ్గురు పిల్లలు మొదటి పాప సిరి వయస్సు 10 సంత్సరాలు, బాబు సత్య సాయి వయస్సు 7 సంత్సరాలు రోహన్ వయస్సు 5 సంత్సరాలు,నీరు పేద దళిత సామాజిక వర్గానికి చెందిన సంపత్ పిల్లల పోషణ భారం గా ఉంది కనీసం ఒక గుంట భూమి కూడా లేని సంపత్ రోజు దిన సరి కూలి చేసి కుటుంబాన్ని పోషించే వాడు అనారోగ్యం పాలై మరణించడం తో సంపత్ పిల్లల యొక్క పోషణ ప్రశ్నర్థకంగా మారింది, సంపత్ భార్య ఆరోగ్య పరిస్థితి కూడా ఆందోళన కరంగా ఉండడం తో పసి పిల్లల యొక్క భవిష్యత్తు ఏమోతుందో అని ఏమి చేయలేని నిస్సహాయక స్థితిలో వున్నా తల్లి ఆందోళన చెందుతుంది, తండ్రిని కోల్పోయి తల్లి ఆరోగ్యం కూడా బాగాలేక పోవడం తో చిన్న పిల్లల యొక్క భవిష్యత్తు ప్రశ్నర్థకంగా మారింది మంచి మనస్సు వున్నా దాతలు మీకు తోచిన రీతిలో సహాయ సహకారాలు అందించి తండ్రిని కోల్పోయి దిక్కుతోచని స్థితిలో వున్నా పసిపిల్లల భవిష్యత్తు కొరకు చేయూతనిస్తారని చేతులెత్తి వేడుకుంటున్నా చిన్నారులు

**Phone pay : 8498088038Google pay: 8498088038**

## ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మూలనకు
# సామ్యవాద వ్యవస్థే ప్రత్యామ్నాయం

**భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి**



**హనుమకొండ బ్యూరో/ఆగస్టు 8 /(జర్నలిస్టు వార్త):** ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర ఆర్థిక, రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని, ఆ సంక్షోభ నివారణకు సోషలిస్టు సామ్యవాద వ్యవస్థ విధానాలే పరిష్కారమని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు. 0 శుక్రవారం హసన్ పర్తి మండల కేంద్రంలో మెట్టు శ్యాంసుందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా నేదునూరి జ్యోతి హాజరై మాట్లాడుతూ పెట్టుబడిదారీ దేశాలు నయా ఉదారవాద క్రోని క్యాపిటల్ లిస్ట్ విధానాలు అమలు చేస్తున్నాయని, ఫలితంగా తీవ్ర ఆర్థిక మాంద్యాన్ని తెచ్చిపెడుతున్నదన్నారు. దేశంలో నవరత్నాలైన ప్రభుత్వ రంగ సంస్థల్ని పాలకులు ప్రైవేటు రంగానికి ధారా దత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఫలితంగా నిరుద్యోగం పెరిగి అసమానతలు ఏర్పడి వర్గ పోరాటాలకు దారితీసి సామ్యవాద వ్యవస్థకు దార్తిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీల పేరుతో ఆడబిడ్డ పెళ్లికి తులం బంగారం, బాలికలకు స్కూటీలు, వితంతు వికలాంగుల పెన్షన్లు రెట్టింపు, ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ. 12000,యువతకు నిరుద్యోగ భృతి, వ్యవసాయ కార్మికులకు చేయూత లాంటి హామీలను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఆగస్టు 20, 21, 22 తేదీలలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గాజులరామారంలో భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు జరగబోతున్నాయని తెలిపారు. ఈ మహా సభల్లో వర్తమాన రాజకీయాలని విశ్లేషిస్తూ భవిష్యత్తులో చేయవలసిన పోరాట కార్యక్రమ రూపకల్పన, నిర్మాణం, నాయకత్వం ఎంపిక ఉంటుందని, సభల విజయవంతానికి హార్థిక, ఆర్థిక సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా మహాసభల పోస్టర్లను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి, భారత్ బచావో జిల్లా కార్యదర్శి దొమ్మాటి ప్రవీణ్ కుమార్, నిర్మాణ బాధ్యులు నేదునూరి రాజమౌళి, నాంపల్లి లక్ష్మయ్య, దుస్స వెంకటేశ్వర్లు, మూడెం రాజేందర్, ఆటో యూనియన్ నాయకులు లింగాల రాజు, రేణిగుంట పరుశు రాములు, తాళ్లపల్లి రాజు, బైకాడి సంపత్, పిట్టల రాజు, ఆర్టీసీ మొగిలి, సంపత్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రక్షాబంధన్



**హనుమకొండ బ్యూరో/ ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** అఖిలభారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రక్షాబంధన్ ఘనంగా నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జ జ్యోతి ఆధ్వర్యంలో జరిగింది వ్యవస్థకు, ప్రజలకు ఎప్పటికప్పుడు భద్రత కల్పిస్తున్నటువంటి పోలీసు అన్నలకు ఏఐఎస్ఎఫ్ నాయకులకు ముందస్తు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసి నాయకులతోపాటు సుబేదారి పిఎస్, హనుమకొండ పిఎస్ ఎస్ఐలకి రాఖి కట్టినారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షురాలు బొజ్జ జ్యోతి మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం , సమానత్వం కోసం సోదరి ,సోదర భావంతో ముందుకు నడవాలని కులమత భేదాలకు అతీతంగా, ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఒక్క పౌరుడు, పౌరురాలు సమానత్వం, ఐక్యతతో జీవించడానికి రాఖీ పండుగ దోహదపడుతుందని అన్నారు. సమాజంలో ప్రస్తుతం మహిళలపై, విద్యార్థినిలపై, అనేక రకాల దాడులు జరుగుతున్నాయని వాటినే అరికట్టడంలో ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. రాఖీ పండుగ సందర్భంగా హన్మకొండ జిల్లా ప్రజలకు, విద్యార్థిని, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకురాలు దీప్తి తదితరులు పాల్గొన్నారు.



## పసుపులేటి నాగరాజు పార్థివదేహానికి పూలమాలు వేసిన , స్నేహితులు



**తల్లాడ/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మల్లవరం గ్రామం లో గుమ్మ హరి స్నేహితుడు పసుపులేటి నాగరాజు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేగళ్ల ఎర్ర శ్రీనివాసరావు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు పాగాడ సానుభూతి తెలియజేశారు పార్థివ దేహాన్ని సందర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండలం అధ్యక్షులు భూక్య అంజి,టిడిపి నాయకుడు నారపోగు ప్రసాద్ బాబు, స్నేహితుడికి ఘన నివాళులు అర్పించారు ,

## రాజీవ్ క్రికెట్ టోర్నమెంట ను ప్రారంభించిన ఆళ్లకుంట



**కల్లూరు/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** పట్టణ పరిధి గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియం నందు రాజీవ్ గాంధీ మెమోరియల్ స్కూల్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా టోర్నమెంట్ నాలుగవ రోజు ఖమ్మం ఆక్స్ఫర్డ్ ,ఖమ్మం హార్వెస్ట్ జట్ల మధ్యసెమిఫైనల్ జరుగుతున్నటువంటి మ్యాచ్ కు టాస్ వేసి మ్యాచ్ ను ప్రారంభించిన కల్లూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆళ్లకుంట నర్సింహారావు. ఈ కార్యక్రమంలో పిఈటి వీర రాఘవయ్య, ఇరుజట్ల కోచులు,మ్యాచ్ రిఫరీ గౌతంరెడ్డి, రాహేల్, ఆనంద్, శివ తదితరులు పాల్గొన్నారు.

## రాఖి పర్వదినం పురస్కరించుకొని ముందస్తుగా రాఖీ వేడుకలు



**కల్లూరు/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** పట్టణ పరిధిలో బాలాజీ హై స్కూల్ నందు రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ముందస్తుగా రాఖీ వేడుకలను నిర్వహించి ముందుగా పాఠశాలలోని విద్యార్థి నులచే విద్యార్థులకు రాఖీలు కట్టించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వలసాల బాలాజీ రాఖీ పండుగ విశిష్టతను తెలియజేస్తూ, రాఖీ పండుగ అనేది అక్క తమ్ముళ్లు, అన్నా చెల్లెలు అనుబంధానికి ప్రతీక అని , సోదరి తనకు సోదరుడు ఎప్పుడు రక్షణగా ఉండాలని, కోరుకుంటుందని, అదేవిధంగా తన సోదరుడు ఆయురారోగ్యాలతో, భోగభాగ్యాలతో ఎల్లప్పుడూ సుఖంగా ఉండాలని కోరుకుంటు, రాఖీని కడుతుందని తెలిపారు, అదేవిధంగా విద్యార్థిని విద్యార్థులు అందరూ తమ సోదరి సోదరీమణులతో చక్కటి అనుబంధాన్ని పెంచుకుంటూ, కలకాలం కలిసి ఉండాలని కోరారు.

## రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన కొండపల్లి



**కల్లూరు/ఆగస్టు8(జర్నలిస్ట్ వార్త):** రాఖీ పండుగ పురస్కరించుకొని పేరువంచ,ముగ్గు వెంకటా పురం ల గ్రామ సోదర సోదరి మణులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు పేరువనంచ గ్రామ పంచాయతీ మాజీ ఎంపీటీసీ కొండపల్లి శ్రీనివాస్ రావు. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ రాఖీ పండుగ విశిష్టతను తెలియజేస్తూ, రాఖీ పండుగ అనేది అక్క తమ్ముళ్లు, అన్నా చెల్లెలు అనుబంధానికి ప్రతీక అని , సోదరి తనకు సోదరుడు ఎప్పుడు రక్షణగా ఉండాలని, కోరుకుంటుందని, అదేవిధంగా తన సోదరుడు ఆయురారోగ్యాలతో, భోగభాగ్యాలతో ఎల్లప్పుడూ సుఖంగా ఉండాలని కోరుకుంటు, రాఖీని కడుతుందని తెలిపారు, అదేవిధంగా పేరువంచ, ముగ్గు వెంకటా పురం గ్రామ పంచాయితీ ల అందరూ తమ సోదరి సోదరీమణులతో చక్కటి అనుబంధాన్ని పెంచుకుంటూ, కలకాలం కలిసి ఉండాలని సూచించారు.